బిల్లుల చెల్లింపు సరళతరం : యుటిఎఫ్

కడప అర్బన్ : మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు సరళతరం చేయడం పట్ల హర్షనీయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవ విజయ్ కుమార్, పాలెం మహేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులకు సంబంధించి రూ.50 వేల పైన బిల్లులను కమిషనర్ ద్వారా వైఎస్ఆర్ ట్రస్ట్ పంపుతారని, ట్రస్ట్ ఆమోదం పొందిన తర్వాత తిరిగి కమిషనర్ ప్రొసీడింగ్ ఇచ్చిన తర్వాత సబ్మిట్ చేసే బిల్లులు పొందే వారని తెలిపారు. ప్రస్తుతం వైఎస్ఆర్ ట్రస్ట్ ఆమోదం పొందిన బిల్లులు కమిషనర్ కార్యాలయంలో వేల సంఖ్యలో ఉండడం వల్ల వాటన్నిటికీ సంబంధించి ఆర్‌సి నంబర్ 240 విడుదల చేస్తూ కమిషనర్ ప్రొసీడింగ్ అవసరం లేకుండానే డిడిఒలు వైఎస్ఆర్ ట్రస్ట్ ఆమోదం అనంతరం బిల్లులు పాస్ చేసుకోవచ్చు అంటూ ఉత్తర్వులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల వల్ల ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు ఆలస్యం కాకుండా వేగవంతంగా ఆమోదం పొంది రీయింబర్స్‌మెంట్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు.

'ఉక్కు' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- గండికోటలో విండ్‌టర్బైన్‌కు భూకేటాయింపు
- సోమశిల వద్ద హైడ్రోస్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు
- అన్నమయ్య జిల్లాలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్
- మంత్రి మండలి సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ భేటీలో మంత్రి మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర విభజన హక్కు చట్టంలో పేర్కొన్న విధంగా 'సెయిల్' ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడాన్ని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిరాకరించింది సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రారంభిస్తామని హామీ నిచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు మూడేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో అనేక పోరాటాలు జరిగాయి. ఈనేపథ్యంలో జగన్ తాజా కేబినెట్ సమావేశంలో జిల్లాలోని సున్నపురాళ్లపల్లెలో రూ.8,800 కోట్ల పెట్టుబడి జెఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ అనే ప్రయివేటు కంపెనీతో ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటును ఒప్పందం కుదుర్చుకుంది. మొదటి దశలో రూ.3,300 కోట్లతో రెండు టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో, రెండవ దశలో 2.5 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపింది. ప్రత్యక్షంగా పరోక్షంగా 6,500 మందికి ఉపాధి లభించనున్నట్లు తెలిపింది. గండికోట రిజర్వాయర్‌లో విండ్‌ట్రైన్ ఏర్పాటుకు 15 ఎకరాలను లీజుకు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. జిల్లాలోని సోమశిల రిజర్వాయర్ వెనుకభాగంలో జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ కంపెనీ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టును ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మైనార్టీ ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో కొత్త విభాగాల ఏర్పాటుతోపాటు జిల్లాలోని [illegible] 20 బోధన, బోధనేతర పోస్టులు చొప్పున 40 పోస్టులను మంజూరు చేయడానికి ఆమోదం తెలిపింది.

3,50,592 మంది పింఛనుదారులకు లబ్ధి

ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌దారులకు శుభవార్త తెలిపింది. దశల వారీగా పింఛన్ పెంపుదలలో భాగంగా తాజా పెంపుతో పెన్షన్ రూ.2,750 వరకు చేరుకుంది. 2023 జనవరి ఒకటిన నూతన సంవత్సర సందర్భంగా అమల్లోకి రానుంది. జిల్లాలోని 3,50,592 మందికి లబ్ధి చేకూరనుంది.

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23 నుంచి 25 వరకు జిల్లాలో పర్యటించనున్నారని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. పులివెందులలోని స్థానిక టిటిడి కల్యాణ మండపం సమీపంలో రూ. 33 కోట్లతో నిర్మించిన నూతన ఆర్‌టిసి నిర్మాణాలను, ఇందిరమ్మ రాణితోపులో నిర్మిస్తున్న నగర వనాన్ని ఆయన పరిశీలించారు. రింగు రోడ్డు సమీపంలో శిల్పారామంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను ఆయన సందర్శించారు. రంగనాథ స్వామి దేవస్థానంలో పులివెందుల నూతన సంత నిర్మాణాలను తనిఖీ చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఈనెల 24న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభోత్సవాలు చేయనున్నారని కలెక్టర్ తెలిపారు. ఈనెల 20లోగా అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధితాధికారులను ఆదేశించారు. ఈ పనులలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, రోడ్లు భవనాల శాఖ అధికారులతో పాటు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్ కుమార్ పరిశీలన** ముఖ్యమంత్రి ఈనెల 24న పులివెందుల పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్ కుమార్ మంగళవారం కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటిస్తున్నారని ముఖ్యమంత్రి ప్రారంభించే కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

అపార నష్టం

46,585 ఎకరాలపై మాండూస్ ఎఫెక్ట్
ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్లు నష్టం?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాండూస్ తుఫాన్ నష్టాల జాబితా పెరుగుతూ పోతోంది. జిల్లాలో శనివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షం జిల్లా రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ఇందులోభాగంగా శనివారం నుంచి కురిసిన వర్షానికి జిల్లావ్యాప్తంగా 46,585 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. సుమారుగా రూ.15 కోట్లకు నష్టం చేరుకున్నట్లు ఓ అంచనా. ఇదిలా ఉండగా సోమ వారం నుంచి మంగళవారం నాటికి 36 మండలాల పరిధిలోని 23 మండలాల్లోని 158 గ్రామాల్లో 30,752 ఎకరాల్లో పంటలు నేల కొరిగాయి. అత్యధికంగా 22,920 ఎకరాల్లో బుడ్డశనగ, 3,628 ఎకరాల్లో వరి, 2,078 ఎకరాల్లో మినుములు, 2,34 ఎకరాల్లో మొక్కజొన్న, 1419 ఎకరాల్లో జొన్న, 37 ఎకరాల్లో చామంతి, 165 ఎకరాల్లో వేరుశనగ, 90 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 144.5 ఎకరాల్లో గ్రీన్‌గ్రామ్ సహా కందులు, కొర్ర, కాపియా కలిసి ఐదు ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అన్నమయ్య జిల్లాలో 2,050 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వీటిలో వరి పంట కోత దశలోనూ, బుడ్డశనగ పూత దశలోనూ, జొన్న పూత, పిండి దశలో, మినుము పంట కోతదశలో ఉండడంతో దిగుబడులపై గణ నీయ ప్రభావం చూపించే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ అధికార యంత్రాంగం 33 శాతం మేరకు దెబ్బతిన్న పంటలను మాత్రమే ఎన్యూమరేషన్ పరిధిలోకి తీసు కోనున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టం వివరాలను వెల్లడించే అవకాశాల నేప థ్యంలో జిల్లా రైతాంగం పీకుల్లోతు కష్టాల్లో మును గుతోంది. ఈనెల 15న మరోసారి తుపాన్ రానుందనే సంకేతాల నేపథ్యంలో జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోంది

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

కడప అర్బన్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి అన్బు రాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఫోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి తుషార్ డూడి, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

సెయిల్ ఆధ్వర్యంలోనే ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో జెఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాదరావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా సెయిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగంలో నిర్మించాలని స్పష్టంగా ఉందని తెలిపారు. సిఎం ప్రకటన విభజన చట్టాన్ని తుంగలో తొక్కి నట్లు కనపడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయివేట్ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం వల్ల సామాజిక న్యాయానికి తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్లు అమలు కాక ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ యువత నష్టపోతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ విభజన హామీల అమలు నిరాకరణ సమర్థిస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రెండు ముక్కలై ఎనిమిదేళ్లయినా విభజన చట్టంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు పూర్తికి, రాజధాని నిర్మాణం పూర్తికి నిధులు కేటాయించి పూర్తి చేయడానికి నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడికి రాష్ట్ర సిఎం కృషి చేయాలని తెలిపారు. సెయిల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు అవసరమైన మలిదశ పోరాటానికి ఉక్కు సాధన ఐక్యవేదిక సన్నద్ధమవుతుందని పేర్కొన్నారు.

అంగన్వాడీ టీచర్ ఆకస్మిక మృతి

పోరుమామిళ్ల టౌన్ : పోరుమామిళ్ల సెక్టార్ పరిధిలోని 6వ సెం టర్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ షంషాద్ మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. పోరు మామిళ్ల ఐసిడిఎస్ ప్రాజెక్టులో పనిచేసే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యులు బైరవ ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బాషా మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరా మర్శించారు. నివాళులర్పించిన వారిలో పోరుమామిళ్ల సెక్టార్ నాయకులు జ్యోతిమ్మ, ప్రాజెక్టు లీడర్ విజయమ్మ, ముసలరెడ్డిపల్లె సెక్టార్ లీడర్ విజయమ్మ, జయంతి, కెవిపిఎస్ నాయకులు రవి, అంగన్వాడీ టీచర్లు, సిఐటియు నాయకులు ఉన్నారు.

సంతాపం ప్రకటిస్తున్న అంగన్వాడీలు

ఉపాధ్యాయుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కలసపాడు

బి.కోడూరు మండలం మేక వారిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు వరప్రసాదరావు మంగళవారం కలసపాడులోని తన స్వగృహంలో ఉరేసేకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు రెండు నెలల కిందట పాఠశాలకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాళ్లకు రాడ్లు వేసుకుని నడవలేని స్థితిలో మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఇదీలా ఉండగా తమకు బిడ్డలు లేరని భార్యాభర్తలు గొడవలు పడేవారు. దీంతో ఆయన మానసిక క్షోభకు గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయుడు మృతిపట్ల బంధువులు, ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు.

ఉరేసుకున్న ఉపాధ్యాయుడు వరప్రసాదరావు

జాతీయ స్థాయిలో మేటిగా నిలవాలి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

అఖిల భారత స్థాయి పోటీల్లో వేమన విశ్వవిద్యాలయం విద్యార్థులు సత్తా చూపాలని విసి ఆచార్య మునగాల సూర్య కళావతి ఉద్బోధించారు. మంగళవారం వేమన యువజనోత్సవ వేడుకలు వైవీయూ సెంట్రల్ లైబ్రరీ భవనం ప్రాంగణంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయం విద్యార్థులను చైతన్యం చేయడంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ కె. కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

కలసపాడు : మండలంలోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో చేపట్టాల్సిన తొమ్మిది అంశాలపై వివరించారు. . గ్రామ సభలు కనీసం మూడు అంశాలైనా నిర్వహించాలని సూచించారు. ఇఒపిఆర్‌డి జి. మురారి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు పంచాయతీల్లో ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, ఇంటింటికీ కుళాయి, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడీ టీచర్లు, వెలుగు కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడప అర్బన్

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగరశాఖ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. రామనపల్లెకు చెందిన అంబటి శివ శంకరయ్య గుండె పోటుతో మృతిచెందారు. ఆయన కుమారులు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఫీజులు కట్టలేని పరిస్థితి తెలుసుకున్న తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం వారి కుటుంబానికి విద్యా నిమిత్తం రూ.1,16,000 సహాయం చేశారు. కార్యక్రమానికి జాతీయ ఉపాధ్యక్షుడు బండారు రఘురామాయ్య, జిల్లా అధ్యక్షులు బండారు సూర్య నారాయణ, బి సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, బిసి సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు సి.ఆర్.ఐ సునీల్ జయంత్, తొగటవీరక్షత్రీయ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా. నరసింహ రావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకురి సుదర్శన్, ఉమ్మడి శెట్టి సుబ్రమణ్యం, పట్టుపోగుల పవన్, రామణపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న సంఘం నాయకులు

బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాండస్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ డిమాండ్ చేశారు. మంగళవారం పాత బస్టాండ్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. . చంద్రబాబు నాయుడు హయాంలో రైతాంగానికి అండగా ఉన్నారని చెప్పారు. శనగ, వరి, చామంతి నీట మునగడంతో రైతులు తీవ్ర నష్టాలలో ఉన్నారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కొండా సుబ్బయ్య, దస్తగిరి, మంజూరు అహమ్మద్, ఖాదరయ్య పాల్గొన్నారు.రి



సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

రాష్ట్ర కార్యదర్శిగా నంద్యాల రాజశేఖర్ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ జూనియర్ అండ్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా నంద్యాల రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ సంఘ సభ్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. జూనియర్ వెటర్నరీ అధికారిగా ఉద్యోగోన్నతి పొందిన వెంటనే గతంలో చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర సంఘం నన్ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

విమానాలు నైట్ ల్యాండింగ్‌కు అనుమతివ్వాలి

ప్రజాశక్తి - కడప

కడప విమానాశ్రయంలో రాత్రి సమయాల్లో కూడా విమానాలు ల్యాండింగ్ అయ్యేలా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్ర సివిల్ ఎవియేషన్ కార్యదర్శి రాజీవ్ బన్సల్‌ను, డైరెక్టర్ జనరల్ అరున్‌కుమార్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన వారిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన వారు వారంలోపు అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కడప విమానాశ్రయం నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు పెరిగిన దృష్ట్యా టెర్మినల్ బిల్డింగ్ చిన్నదిగా ఉండటం కొత్తది ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ

మండల స్థాయి సైన్సు ఫెయిర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాధ్య ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం సైన్సుఫెయిర్ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మంటపం పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయులు డి. ప్రభాకర్ వ్యమరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మంటపంపల్లి, ఒంటిమిట్ట, కొత్త మాధవరం, రాచపల్లి, చింతరాజు పల్లి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నేడు కడప నగర్‌లో ..** నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీలో ఈనెల 14న కడప మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ పాలెం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు గైడ్ టీచర్‌లతో ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చున్నారు.

ఎపిలో త్వరలో ఆర్థిక సంక్షోభం

ప్రజాశక్తి- కడప

త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంక్షోభ పరిస్థితి రాబోతోందని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది అన్నారు. ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పింఛన్లు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్రం ఉందని చెప్పారు. పనులు చేసిన బిల్లులకు బకాయిలు చెల్లించి తమ ప్రాణాలు కాపాడాలంటూ గుత్తేదారులు భిక్షాటన చేస్తున్నారన్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో పాడైపోయిన, కొట్టుకుపోయిన నీటి ప్రాజెక్టుల మరమ్మతులు ఇంతవరకు చేపట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జోడు నాగరాజు, పిసిసి మాజీ జాయింట్ సెక్రెటరీ కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, గౌస్ మొద్దీన్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఆరిపుల్ల పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండలంలోని తిమ్మారెడ్డిపల్లి రేషన్ దుకాణంలో ఐదు నెలల నుంచి రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వకపోవడం బాధాకరమని మానవ హక్కుల పరిరక్షణ ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 13 తేదీ అయినా ఇంతవరకూ గ్రామంలో రేషన్ సరుకులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డీలర్ షాపు పరిధిలో ఎస్‌సిలు, బిసిలు అధికంగా ఉన్నారని, వారు రేషన్ సరుకులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇంతవరకూ బియ్యం ఇవ్వకపోవడం దారుణమని వెంటనే డీలరు సరుకులు పంపిణీ చేసేలా డిఎస్‌ఒ చర్యలు తీసుకోవాలని కోరారు.

హాకీ పోటీలకు 'ఎస్‌వి' విద్యార్థి ఎంపిక

ప్రజాశకి-కడప సిటీ

స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజి నీరింగ్ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్.వి. రాఘవేంద్ర ప్రసాద్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శనరెడ్డి పేర్కొన్నారు. రాఘవేంద్రప్రసాద్ ఈనెల 20 నుంచి 30 వరకు భువనేశ్వర్‌లో నిర్వహించబోయే పోటీల్లో ఎపి తరుపున పాల్గొంటారని తెలిపారు. మంగళవారం కళాశాల వైస్ చైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం, కళాశాల ప్రిన్సిపల్, ఇసిఇ విభాగాధిపతి ప్రవీణ్‌కుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. రవి కుమార్ విద్యార్థిని అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

కడప : మహిళలు ఆరోగ్యం, పరిశుభ్రత పై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్, జువాలజీ లెక్చరర్ డాక్టర్ వై. సావిత్రి సూచించారు. మంగళవారం ఆర్ఆర్‌సి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్యేక సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి. రవీంద్ర, ఆర్ఆర్‌సి కన్వీనర్ అయ్యవారురెడ్డి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వలేని వైసిపికి పాలించే అర్హత లేదు

ప్రజాశక్తి-కడప

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు నెల నెల సక్రమంగా ఇవ్వలేని వైసీపీ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శ నమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్లో ఉద్యోగుల, పెన్షనర్ల డిసెంబర్ జీతాలు 13వ తేదీ గడచినా ఇంకా జీతాలు వారి ఖాతాలో జమ కాకపోవడం దారుణమని వాపోయారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర విభజన సమయంలో రూ.16 వేల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు ఇచ్చేవారని అన్నారు. నాటి ప్రతిపక్ష నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పాద యాత్రలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తేదీన జీతం పడితే వారి ముఖంలో చిరునవ్వు చూస్తానని నమ్మబలికారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్, యాదవ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వికాస్ హరి

పైప్‌లైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని పుల్లీవీడు నుంచి పట్టణానికి సరఫరా చేసే తాగునీ పైప్‌లైన్‌ను మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మంగళవారం మరమ్మతుల చేయించారు. రెండు రోజుల కిందట నరసింగంపల్లె వద్ద ఉన్న పైప్‌లైన్ పగిలిపోవడంతో పట్టణవాసులు నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. తుపాను కారణంగా రిపేరు చేపట్ట లేకపోయామని, వర్షం తగ్గినందున ఇప్పుడు మరమ్మతుల చేయించామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని వస్తే సత్వరమే పరిష్కరిస్తానని చెప్పారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితం

ప్రజాశక్తి-కాశినాయన

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా ఉంటాయని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. మండలంలోని గర్భిణులకు సురక్షితంగా కాన్పులు అయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఇటీవల ఆనుభవం కల్గిన స్టాఫ్‌నర్సులు మాధవి, మల్లీశ్వరి వచ్చారని, వారు ఆధ్వర్యంలో కాన్పులు సులభతరం అవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణ తప్పనిసరి

కడప : క్రమశిక్షణ, సమయపాలన ఎన్‌సిసి కేడెట్లకు ఉండాల్సిన ముఖ్య లక్షణమని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ విబోర్ గుప్తా అన్నారు. నగరంలోని తెలుగు గంగ కాలనీలో 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 11వ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం మేధావుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వివేకానంద రెడ్డి కేడెట్లకు నాయకత్వ లక్షణాలపై వివరించారు. కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారులు లెఫ్టినెంట్ మహేష్, వెంకటరమణ, అశోక్ కుమార్, రాజశేఖర్, ఇమామ్ ఖాసీం, ఆఫీస్ సిబ్బంది సూపరిండెంట్లు సరస్వతి, డేవిడ్, రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్ పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ సుఖేందర్‌సింగ్, ఈశ్వర్‌రెడ్డి, ఎస్.ఎస్.రావు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కల్నల్ విబోర్ గుప్తా

రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కడప

మాండోస్ తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే అధికారులు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం బుగ్గ వంక డ్యాం పరిస్థితిని ఆయన ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుత నీటిమట్టం 179 అడుగులుగా ఉన్నట్లు అధికారులు వివరించారు. నగర ప్రజలకు ప్రస్తుతం వచ్చిన ప్రమాదం ఏమీ లేదన్నారు. అనంతరం మీడియాతో నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరద ప్రభావిత ముంపు ప్రాంతాలను అధికారులు దృష్టిలో ఉంచుకొని తగిన సహాయ ఏర్పాట్లు చేయాలన్నారు . కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ బొజ్జా తిరుమలేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, ఎస్టీ సెల్ జిల్లా నేత సేద్రం కుమార్, జిల్లా నేతలు సాదిక్ అలీ, చాన్‌బాష, సత్యం పాల్గొన్నారు.

బుగ్గవంక డ్యామ్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హామీని నెరవేర్చిన సిఎం

ప్రజాశక్తి-కడప

అధికారంలోకి రాగానే స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, కె.సురేష్ బాబు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప ఉక్కు, రాయలసీమ హక్కు అంటూ వైసిపి గతంలో ప్రతిపక్షంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరాటాలు చేశామని చెప్పారు. అధికారంలోకి రాగానే శంకుస్థాపన చేసి దేశంలో పేరుగాంచిన జెఎస్‌డబ్ల్యూ రెండవ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకున్న జగన్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి హయాంలో ఎంపీతో ఎన్నికల స్టంట్ గా నిరాహార దీక్ష చేశారన్నారు. జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కరోనా ప్రభావం తో భారీ పరిశ్రమ ఏర్పాటుకు అవరోధంగా మారింది అన్నారు. సమావేశంలో నారపురెడ్డి సుబ్బారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు షఫీ, సురేష్, ఎల్లారెడ్డి, కిరణ్, సూర్యనారాయణ, మాధవరెడ్డి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కష్టపడాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడ్డాలని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఐఎంయు కమ్యూనిటీకి చెందిన సర్దార్, ఆయన స్నేహితులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లిపోవడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేయాలన్నారు. అనంతరం సర్దార్ మాట్లాడుతూ శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో పాల్గొని ఆయా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళతానని తెలిపారు. టిడిపిలో బ్రహ్మయ్య ఆచారి, షేక్ మున్నా, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు చేరారు.

టిడిపిలో చేరిన వారితో భూపేష్‌రెడ్డి

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వినాయక నగర్ కాలనీలో అగాపే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు జాన్ తెలిపారు. శిబిరాన్ని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ కంటి పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌తోపాటు ప్రయాణ, భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలతోపాటు ఎర్రగుంట్ల పరిసర ప్రాంత ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని జాన్ కోరారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికితీయాలి

చాపాడు: విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికి తీయాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్‌పి ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై నిరంతర దృష్టి సారించాలన్నారు. ఆలోచన విధానం, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. వక్తలు విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై వివరించారు. వాతావరణ మార్పులు, సాఫ్ట్‌వేర్ యాప్‌లో నరవాహనం విద్యార్థులు, ఆరోగ్య పరిశుభ్రత అంశంలో చాపాడు విద్యార్థులు, గణితం అంశంపై కస్తూర్బా విద్యార్థులు, పర్యావరణ అంశంపై అన్నవరం విద్యార్థులు ఏర్పాటు చేసిన అంశాలు మొదటి బహుమతులు అందాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోగ్రెస్ ఫౌండేషన్ అధ్యక్షులు చాపాటి రామసుధాకర్‌రెడ్డి రూ.500 నగదు బహుమతి, మెమెంటో ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ బాల్లి, ప్రధానోపాధ్యాయులు గోనెమద్దిన్, నరసింహ శాస్త్రి, నరహరి శర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

కొండాపురం: విద్యార్థులలోని నైపుణ్యాన్ని, మేధాశక్తిని, సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశమని ఎంఇఒ యం.ఓబులేసు పేర్కొన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల నుండి దాదాపు 50 రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. కొండాపురం, లావనూరు, తాళ్ల ప్రొద్దుటూరు, చెవిటిపల్లి పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు అర్హత సాధించినట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రామయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాలమహానాడు చొరవతో క్షేమంగా చేరిన మహిళ

ప్రొద్దుటూరు: ఉపాధి కోసం స్థానిక చాను బిహారిన్ గల్ఫ్ దేశానికి వెళ్లి, పంపిన ఏజెంట్ ద్వారా మోసపోయి పలు కష్టాలకు గురైంది. ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్న సమయంలో మాలమహానాడు చొరవ చూపి పోలీస్ అధికారుల సహకారంతో ఆమెను ప్రొద్దుటూరు రప్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోన మనోహర్ మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తనకు బాధిత మహిళ చాను సమాచారం అందిన వెంటనే ఎస్‌పి, టూటౌన్ సిఐ ఇబ్రహీం ఫిర్యాదు చేశామన్నారు. పోలీస్ అధికారుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఆమె ప్రొద్దుటూరుకు రాగలిగిందని తెలిపారు. పోలీస్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. బాధిత మహిళ చాన్ మాట్లాడుతూ ఉపాధి కోసం వెళ్లే అక్కడ చాలా ఇబ్బందులకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక భారతీకు పోలేనేమోనని చావే శరణ్యం అనుకుంటున్న సమయంలో ఎస్‌పి అన్బురాజన్, టూటౌన్ సిఐ ఇబ్రహీం శ్రద్ధ తీసుకోవడం వల్ల తాను తనవాళ్లను మళ్లీ చూడగలిగానని ఉద్వేగభరితంగా పేర్కొన్నారు.

టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి

ఖాజీపేట: తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో మైనార్టీలందరూ ఆ పార్టీకే పట్టం కట్టాలని టిడిపి కడప జిల్లా మైనార్టీ జాయింట్ సెక్రెటరీ కమలాపురం గౌస్ మొహిద్దీన్ కోరారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వంలో మైనార్టీలకు పదవులు కట్టబెట్టిందే తప్ప వారి అభివృద్ధి, సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్ద ఎత్తున పథకాలు అమలయ్యాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

భాషలపై జిల్లా స్థాయి పోటీ పరీక్షలు

కడప అర్బన్ : మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవతరగతి విద్యార్థులకు భాషలలో ప్రతిభను వెలికి తీసేందుకు భాషోపాధ్యాయ సంఘ (స్పాటో), సంస్కృత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర కోశాధికారి బి.గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్టేట్ హైస్కూల్ లో పోటీ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మొదటి, రెండు, మూడవ బహుమతులు, ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు, కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

పత్తిలో కాయకుళ్లు తెగులు

ఖాజీపేట: అకాల వర్షాలతో పత్తి పంటలో కాయకుళ్లు తెగులు ఆశించిందని, తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచించారు. మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలోని పత్తి పంటలను మంగళవారం వ్యవసాయ ఉన్నత అధికారులు శిల్పకళ, మహేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రశాంత్, వ్యవసాయ మండల స్థాయి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండాపురం: మండలంలోని దొంకుపల్లి ఆశ్రమం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున టాటా సుమో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలు.. కర్నాటక రాష్ట్రం చిక్ బళ్లాపూర్ జిల్లా చింతామణికి చెందిన 10 మంది వ్యక్తులు కాళ్ళ నొప్పుల వైద్యం కోసం టాటా సుమోలో అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో వైద్యం చేయించుకున్నారు. తిరుగు ప్రయాణంలో సుమో డ్రైవర్ నిద్ర మత్తులోకి వెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో రెడ్డప్ప(60) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని పులివెందుల ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పొలాల్లో నీరు.. మొలకెత్తని పొద్దుతిరుగుడు

ప్రజాశక్తి - వేంపల్లె

మాండూస్ తుపాను వల్ల కురిసిన వర్షాలకు పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పొలాల్లో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట మొలకెత్తలేదని ఆ రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఇడుపులపాయ పంచాయతీ పరిధిలో దాదాపు 70 ఎకరాల్లో 10 రోజుల క్రితం రైతులు పొద్దుతిరుగుడు పంటను సాగు చేసినట్లు రైతు శంకరయ్య తెలిపారు. పంట సాగుకు ఎకరాకు రూ.12 వేలు ఖర్చు చేశామన్నారు. తుపాను ప్రభావంతో పొలాల్లో వర్షపునీరు వచ్చి చేరడంతో పంట మొలకెత్తలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులకు సమాచారమిచ్చి పంటను సాగు చేశామని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలతో పొలాల్లో నీటి ఊటలు వస్తున్నాయని తెలిపారు. పొద్దుతిరుగుడు పంట వల్ల ఆదాయం వస్తుందని ఎంతో ఆశతో సాగు చేశామన్నారు. ఆరంభ దశలోనే నష్టపోయామని రైతులు వాపోతున్నారు. అక్కడక్కడ మొలకెత్తిన పంట కూడా వర్షపు నీటికి మొక్కలు ఎర్ర బారాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రం అధికారి ఫకృద్దీన్ మొలకెత్తని పంటను పరిశీలించారు. పొలాల్లో గడ్డి పెరిగిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. పొద్దుతిరుగుడు పంటను సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మొలకెత్తని పొద్దుతిరుగుడు పంటలో నిలిచిన నీటిని చూస్తున్న రైతులు

అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంత ఖర్చయినా వెనుకాడబోమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే వార్డు కౌన్సిలర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిటి రోడ్లు, సిసి రోడ్లు, డ్రయినేజీ, పైప్‌లైన్ సమస్యలు ఉన్నాయని, వాటిని తక్షణమే టెండర్ల ద్వారా పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని, వాటిలో కొన్ని టెండర్లు మాత్రమే వచ్చాయని కమిషనర్ తెలిపారు. మిగిలిన టెండర్లకు కూడా రెండు మూడు రోజుల్లో ప్రకటన ఇస్తామన్నారు. టెండర్లు పిలిచిన వాటికి పనులు మొదలు పెట్టాలని ఎమ్మెల్యే కౌన్సిలర్లను కోరారు. అవినీతికి తావు లేకుండా వైసిపి ప్రభుత్వం ఎంతో ఖర్చు పెడుతోందన్నారు. రూ.19 కోట్ల ఖర్చుతో పట్టణంలో రోడ్లు వెడల్పు చేస్తామని చెప్పారు. హౌసింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చర్చించి, ఆదేశాలిచ్చారు. జగనన్న కాలనీల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, పట్టణ అధ్యక్షులు కెసి లింగన్న, మున్సిపల్ కమిషనర్ రాముడు, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గృహాలను త్వరగా పూర్తి చేయండి

నవరత్నాల్లో భాగంగా ఇల్లు లేని నిరుపేదలు ఎవరు ఉండకూడదనే ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన జగనన్న కాలనీ గృహ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాల ద్వారా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందని వారికి జనవరి నుండి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర. మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ డిఇ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, పోలవరం లేదనడం శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, పోలవవరం లేదని కేంద్రప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా చెప్పడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా ఆంధ్రప్రదేశ్ హక్కు.. రాష్ట్రానికి సంజీవని లాంటిదని తెలిపారు. 2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటు సాక్షిగా 5 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ప్రకటించారని తెలిపారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమల్లో ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకం వంటి కేంద్ర ప్రయోజిత వంటి పథకాలకు 90 శాతం నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. ప్రత్యేకహోదా లేని రాష్ట్రాలకు కేంద్రం 60 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. విదేశీ ఆర్థిక సంస్థల సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టులకు వంద శాతం నిధులు కేంద్రం భరిస్తుందని, అదే ప్రత్యేకహోదా లేకపోతే రాష్ట్రాలే వందశాతం నిధులు భరించాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి భగవంతుడు ప్రసాదించిన వరమన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు 10.13 లక్షల ఎకరాల నీరు సరఫరా కావడంతోపాటు 540 గ్రామాలకు తాగునీరు, 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో ప్రయోజనాలు ఉన్నట్లు చెప్పారు. 2014, 2019లోగానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే 'హోదా' అమలు కావడంతోపాటు పోలవరం పూర్తయి ఉండేదన్నారు. ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేకహోదా ఇచ్చే శక్తి, తెచ్చే శక్తి లేదన్నారు. పోలవరం పూర్తి చేసే స్థోమతలేదన్నారు. కాంగ్రెసును గెలిపిస్తే ప్రత్యేకహోదా రావడం, పోలవరం పూర్తవుతుందన్నారు.

విద్యార్థులు సేవా భావంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు సేవా భావంతో ముందుకెళ్లాలని సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక ఎస్‌పి డిగ్రీ కళాశాల ఎన్‌సిసిని ఎన్‌సిసి అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఎన్‌సిసి విద్యార్థులు మేజర్ టి.మాంగాయ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మేజర్ మాంగాయ్ మాట్లాడుతూ ఎస్‌పి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. యూనిట్ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఎన్‌సిసి కమాండర్ పొన్నతోట రాజుకు ఆయన పలు సూచనలిచ్చారు. కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజక వర్గంలోనే మొట్టమొదటి ఎన్‌సిసి ఉన్న కళాశాల సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల అని పేర్కొన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఎన్‌సిసి పూర్తి చేసి సర్టిఫికెట్ పొందిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హవల్దార్ నీరజ్ కుమార్, కళాశాల అధ్యాపక బృందం, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విభాగాన్ని 30 ఆంధ్రా బెటాలియన్ మేజర్ కమాండర్ మాండ్య సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన కళాశాలలో ఎన్‌సిసి నిర్వహణ, చేసిన యాక్టివిటీలను గురించి తెలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సిసి ఒక క్రమశిక్షణతో కూడిన దేశ భవిష్యత్తుకు పునాదులు వేసే ఒక గొప్ప విభాగమని వివరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ అలకటవేముల హరి నారాయణ మాట్లాడుతూ స్థానికంగా ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి యూనిట్ కలిగి ఉండడం మాకు చాలా గర్వకారణమన్నారు. సిటిఒ గౌరీ శంకర్ మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడేట్స్ సేవా కార్యక్రమాల్లోనూ, అవగాహన కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొని వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటున్నారన్నారు.

జమ్మలమడుగు రూరల్ : మేజర్‌కు స్వాగతం పలుకుతున్న యాజమాన్యం, విద్యార్థులు

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక 8వ వార్డులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతిగడపకు వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే రాకతో అపరిశుభ్ర ప్రదేశాలను, రోడ్లపై నిల్వ ఉన్న నీటిని తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులపై ఎమ్మెల్యే ఎదురుగానే బాహాటంగా కొందరు మహిళలు విమర్శలు చేశారు. కొన్ని రోజుల నుండి రోడ్లపై నీరు నిల్వ ఉండడం, ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉండటంతో వాటి గుండానే రోజూ పిల్లలను పాఠశాలకు తీసుకెళుతున్నామన్నారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాల్సింది పోయి ఇలా చేయడం సమంజసం కాదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు మాత్రం సకాలంలో చెల్లించుకుంటున్నారే తప్ప, సమస్యలను మాత్రం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల వినతి

ఆర్‌డిఒకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

పులివెందుల టౌన్ : పులివెందుల మీదుగా నేషనల్ హైవే భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని మంగళవారం రైతులు ఆర్‌డిఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా కోరుకొండ చెక్ పోస్ట్ నుంచి, ప్రకాశం జిల్లా మేదరమెట్ల వరకు నిర్మించనున్న నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వెంకటేశ్వర్లుకు వినతిపత్రమిచ్చారు. ఎకరా భూమికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెబుతున్నారని, కానీ మార్కెట్లో ఎకరం భూమి విలువ రూ.కోటి 50 లక్షలు పలుకుతోందని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.45 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని ఆర్‌డిఒ రైతులకు హామీ ఇచ్చారు.

నూతన పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో నూతనంగా 171 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. మండల వ్యాప్తంగా 22 గ్రామపంచాయతీల్లో ఇప్పటివరకు వితంతు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధాప్య పింఛన్లు 5,817 ఉన్నాయన్నారు.

మహిళలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి మహిళలకు తడి, పొడి చెత్త గురించి మహిళలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. పట్టణంలోని శ్రీరామ టెంపుల్ సచి వాలయ పరిధిలో మంగళ వారం శానిటేషన్ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు మహి ళలకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టలో ఉంచి చెత్త సేకరణ వాహనానికి అం దించాలన్నారు. నిబంధనల ప్రకారం ఆకుపచ్చ రంగు బుట్టలో తడి చెత్తను, బ్లూ రంగు ప్లాస్టిక్ బుట్టలో పొడి చెత్తను, ఎరుపు రంగు బుట్టలో హానికర వ్యర్థాలను వేరు చేసి పురపాలక చెత్త సేకరణ వాహనానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఖాజీపేట : మైదుకూరు రోడ్డులోని బాలికల వసతిగృహంలో మంగళవారం విద్యార్థులకు ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ బాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్యలక్ష్మి పరీక్షలు నిర్వహించారు. అవ సరమైన మందులు అంద జేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త గ్రూప్ పరీక్షలు, బరువు, ఎత్తు, చిన్న వ్యాధుల చికిత్సలు చేశారు. ఎవరికైనా జలుబు, దగ్గు, గజ్జి, తామర, వంటి వ్యాధులు ఉంటే చెప్పాలన్నారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు పొందాలని డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, హాస్టల్ వార్డెన్ మంగమ్మ, ఎంఎల్‌హెచ్ పి.కీర్తి, ఎఎన్ఎమ్ శివనాగమణి, పకృతమ్మ, ఆశ కార్యకర్తలు సరళ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** స్థానిక లయోలా డిగ్రీ కాలేజి సమీపంలో ఉన్న బాలికల వసతిగృహంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్ పాల్గొన్నారు.

పలు అంశాలపై అవగాహన

ఎర్రగుంట్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఉత్తర్వుల మేరకు 'జెండర్ ఈక్వాలిటీ' అనే అంశంపై మంగళ వారం విద్యార్థులకు అవ గాహన సదస్సును నిర్వ హించారు. కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అనేక దురాచారాలు, అసమానతలు, బాల్య వివాహాలు, ఫోక్స్ చట్టం, గృహహింస అంశాలపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వపు పోటీలు, చిత్రలేఖనం కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ విజయదుర్గ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

లింగాల : జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను మంగళవారం ఎంపిపి అమృత పంపిణీ చేశారు. మండలంలోని నరసింగరావు పల్లె గ్రామంలో 35 మంది రైతులు భూ హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 25 మంది రైతులకు పత్రాలను అందజేశారు. మండలంలో పైలెట్ విలేజ్‌గా నరసింగరావుపల్లి ఎంపికైందని తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు : సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని టిడిపి నాయ కులు, కార్యకర్తలని చెప్పుకు నేవారు మోసపూ రితంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి వాళ్ల పట్ల నియో జకవర్గ ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి ధీటుగా టిడిపి 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ప్రవేశపెట్టిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలకు చెప్పే అంశాలు ఏమీ లేకపోవడంతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక అవసరాలు తీరుస్తామని నమ్మబలికి ఇంటి యజమాని వద్ద నుండి సెల్‌ఫోన్ ద్వారా 92612 92612 మిస్డ్ కాల్ చేసిన వెంటనే ఓ మెసేజ్ వస్తుందని జాయిన్ గ్రూప్ అన్నదానిపై క్లిక్ చేయడంతో టిడిపి కార్యకర్తల మోసం మొదలవుతుందన్నారు. ఇలా పెక్కు మందిని చేర్పించుకొని అధిష్టానం వద్ద మార్కులు కొట్టేసే మోసానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, 12వ వార్డు ఇన్‌ఛార్జి హనీఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి

మందులు అందుబాటులో ఉంచాలి : సిఐటియు

కడప అర్బన్: కడప ఇఎస్ఐ ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు కార్యాలయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వేలాది మంది ఈఎస్ఐ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వారికి మందులు అందుబాటులో లేవని పేర్కొన్నారు. ప్రధానంగా గుండె, కిడ్నీ, పక్షవాతం సంబంధించిన వ్యాధుల వారు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారని చెప్పారు. మందులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మందులు అందుబాటులో ఉంచకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

బాలుడిని కాపాడిన పోలీసులు

వల్లూరు : రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన బాలుడిని కడప చిన్నచౌకు పోలీసులు కాపాడారు. వివరాలు.. కడప ప్రకాష్‌నగర్‌కు చెందిన పి. కార్తిక్ వల్లూరులోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్నాడు. తనకు చదువుపై ఆసక్తి లేదని, రైలు కింద పడి చనిపోతానంటూ కాగితంపై రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గమనించిన అతని తల్లి స్వర్ణలత పోలీసులను ఆశ్రయించారు. హెడ్ కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, బాలరాజు, రక్షక్, బ్లూకోల్ట్ సిబ్బంది రంగంలోకి దిగారు. రైల్వేట్రాక్‌పై విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. శిల్పారామ సమీపంలోని ట్రాక్‌పై బాలుడిని గుర్తించి అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు. బాలుడిని రక్షించిన పోలీసులను ఎస్‌పి అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు ప్రకటించారు.

CHANGE OF NAME

I MORUS GANGADHARA (old name), S/o M. Pedda Ramulu, D.No. 3-49, Baduguvaripalle (vi), Bondalakunta (Po), Muddanur (m) kadapa (dt). Have changed my name as MORUSU GANGADHARA (new name) S/o M. Pedda Ramulu.

CHANGE OF NAME

I MORUS RAMULU (Old name), S/o M. Ganganna, D.No. 3-49, Baduguvaripalle (vi), Bondalakunta (Po), Muddanur (m), kadapa (dt). Have changed my name as MORUSU PEDDA RAMULU (new name) S/o M. Ganganna.

CHANGE OF NAME

I MORUS ANJANAMMA (Old name), W/o M. Pedda Ramulu, D.No. 3-49, Baduguvaripalle (vi), Bondalakunta (Po), Muddanur (m) kadapa (dt). Have changed my name as MORUSU ANJANAMMA (new name) w/o M. Pedda Ramulu.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA

ORIGINAL SUIT NO. 1140 OF 2019

Between:
Bandi Subba Reddy Son of Bandi Pitchi Reddy, aged about 64 years, Hindu,agriculture, resident of D.No.1/165 Chemmumiahpet, Kadapa City and District. **...Plaintiffs**

And

1. Smt. Sanda Mallamma Wife of late Sanda Sanjeeva Reddy, aged about 79 years,Hindu, house-wife, resident of Door No. 77/189, SBI Colony, Akkayapalli, Kadapa City.
4. Sanda Mallikarjuna Reddy Son of late Sanda Sanjeeva Reddy,aged about 37years, Hindu, resident of Door No. 77/189, SBI Colony, Akkayapalli, Kadapa City.
7. Smt. M. Sandamma Wife of M. Easwar Reddy, aged about 50 years, Hindu, house-wife, resident of Door No. 4-5-4-2-2, Marpuri Veedhi, Madanapalle Town, Chittoor District.

...Defendants Nos.1,4 and 7.

I.A.No. 1400 of 2019 in O.S.No. 1140 of 2019
NOTICE TO RESPONDENTS Nos.1, 4 and 7 -DEFENDANTS Nos.1,4 and 7.

Please take notices that the petitioner/plaintiff have filed the above I.A. against youfor grant of temporary injunction, case stands posted for your appearance either personally or through an advocate, at 10.30 A.M. on 20.01.2023 before the said court and if you fail to appear, matter will be decided exparte.

SUIT SUMMON TO DEFENDANTS Nos.1, 4 and 7.

Please take summons that the plaintiffs have filed the above suit against you for specific performance of agreement of sale dt. 06.08.2005 and for permanent injunction, case stands posted for your appearance either personally or through an advocate at 10.30 A.M. on 20.01.2023 before the said court and if you fail to appear,matter will be decided exparte.

M.SURESH KUMAR, M.A.B.L
Advocate for the Petitioner-Plaintiff, Kadapa. Cell: 9440673990.

శాస్త్ర సాంకేతిక ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్యామల దేవి అన్నారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఐదు విభాగాల్లో రూపొందించిన ప్రయోగాలను పరిశీలించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండవాండ్ల పల్లి చెందిన విద్యార్థులు జి అశోక్. ఎస్ సల్మా తయారుచేసిన 'వాతావరణం, పర్యావరణ మార్పులు' అనే అంశంపై చేసిన ప్రయోగానికి ప్రతమ బహుమతిగా జిల్లా స్థాయికి ఎంపికైంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షామీర్‌బాషా, టీచర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకటరమణ రాజు పాల్గొన్నారు.

'ఉక్కు' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- గండికోటలో విండ్‌టర్బైన్‌కు భూకేటాయింపు
- సోమశిల వద్ద హైడ్రోస్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు
- అన్నమయ్య జిల్లాలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్
- మంత్రి మండలి సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ భేటీలో మంత్రి మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర విభజన హక్కు చట్టంలో పేర్కొన్న విధంగా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడాన్ని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రారంభిస్తామని హామీ నిచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు మూడేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో అనేక పోరాటాలు జరిగాయి. ఈనేపథ్యంలో జగన్ తాజా కేబినెట్ సమావేశంలో జిల్లాలోని సున్నపురాళ్లపల్లిలో రూ.8,800 కోట్ల పెట్టుబడి జెఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ అనే ప్రయివేటు కంపెనీతో ఇంటెగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. మొదటి దశలో రూ.3,300 కోట్లతో రెండు టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో, రెండవ దశలో 2.5 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపింది. ప్రత్యక్షంగా పరోక్షంగా 6,500 మందికి ఉపాధి లభించనున్నట్లు తెలిపింది. గండికోట రిజర్వాయర్‌లో విండ్‌టర్బైన్స్ ఏర్పాటుకు 15 ఎకరాలను లీజుకు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. జిల్లాలోని సోమశిల రిజర్వాయర్ వెనుకభాగంలో జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ కంపెనీ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టును ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మైనార్టీ ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో కొత్త విభాగాల ఏర్పాటుతోపాటు జిల్లాలోని ఒక్కో ఐటిఐకు 20 బోధన, బోధనేతర పోస్టుల చొప్పున 40 పోస్టులను మంజూరు చేయడానికి ఆమోదం తెలిపింది.

3,50,592 మంది పింఛనుదారులకు లబ్ధి

ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌దారులకు శుభవార్త తెలిపింది. దశల వారీగా పింఛన్ పెంపుదలలో భాగంగా తాజా పెంపుతో పెన్షన్ రూ.2,750 వరకు చేరుకుంది. 2023 జనవరి ఒకటిన నూతన సంవత్సర సందర్భంగా అమల్లోకి కానుంది. జిల్లాలోని 3,50,592 మందికి లబ్ధి చేకూరనుంది.

అపార నష్టం

- 46,585 ఎకరాలపై మాండూస్ ఎఫెక్ట్
- ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్లు నష్టం?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాండూస్ తుఫాన్ నష్టాల జాబితా పెరుగుతూ పోతోంది. జిల్లాలో శనివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షం జిల్లా రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ఇందులోభాగంగా శనివారం నుంచి కురిసిన వర్షానికి జిల్లావ్యాప్తంగా 46,585 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. సుమారుగా రూ.15 కోట్లకు నష్టం చేరుకున్నట్లు ఓ అంచనా. ఇదిలా ఉండగా సోమ వారం నుంచి మంగళవారం నాటికి 36 మండలాల పరిధిలోని 23 మండలాల్లోని 158 గ్రామాల్లో 30,752 ఎకరాల్లో పంటలు నేల కొరిగాయి. అత్యధికంగా 22,920 ఎకరాల్లో బుడ్డశనగ, 3,628 ఎకరాల్లో వరి, 2,078 ఎకరాల్లో మినుములు, 2,34 ఎకరాల్లో మొక్కజొన్న, 1419 ఎకరాల్లో జొన్న, 37 ఎకరాల్లో చామంతి, 165 ఎకరాల్లో వేరుశనగ, 90 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 144.5 ఎకరాల్లో గ్రీన్‌గ్రామ్ సహా కందులు, కౌపియా కలిపి ఐదు ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అన్నమయ్య జిల్లాలో 2,050 ఎకరాల్లో నష్టం వాట్లింది. వీటిలో వరి పంట కోత దశలోనూ, బుడ్డశనగ పూత దశలోనూ, జొన్న పూత, పిందె దశలో, మినుము పంట కోతదశలో ఉండడంతో దిగుబడులపై గణ నీయ ప్రభావం చూపించే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ అధికార యంత్రాంగం 33 శాతం మేరకు దెబ్బతిన్న పంటలను మాత్రమే ఎన్యూమరేషన్ పరిధిలోకి తీసుకోనున్న నేప థ్యంలో పూర్తిస్థాయిలో ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టం వివరాలను వెల్లడించే అవకాశాల నేప థ్యంలో జిల్లా రైతాంగం పీకుల్లోతు కష్టాల్లో మును గుతోంది. ఈనెల 15న మరోసారి తుపాన్ రానుందనే సంకేతాల నేపథ్యంలో జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోంది.

విమానాలు నైట్ ల్యాండింగ్‌కు అనుమతివ్వాలి

కడప: కడప విమానాశ్రయంలో రాత్రి సమయాల్లో కూడా విమానాలు ల్యాండింగ్ అయ్యేలా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్ర సివిల్ ఎవియేషన్ కార్యదర్శి రాజీవ్ బన్సల్‌ను, డైరెక్టర్ జనరల్ అరున్‌కుమార్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన వారిని కలిసి వినతి పత్రం అందజేశా రు. స్పందించిన వారు వారంలోపు అను మతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చా రు. అలాగే కడప విమానాశ్రయం నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు పెరిగిన దృష్ట్యా టెర్మినల్ బిల్డింగ్ చిన్నదిగా ఉండటం కొత్తది ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

పారదర్శకంగా పంట నష్టం వివరాల సేకరణ

దెబ్బతిన్న అరటి తోటల పరిశీలనలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లాలో మాండూస్ తుపాను ప్రభావం వల్ల పంట నష్టం జరిగిన రైతులందరికీ నష్టపరిహారం అందజేస్తామని, పారదర్శకంగా వివ రాలను సేకరిస్తామని కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం మండలంలోని హస్తవరం, చర్లోపల్లెలో తుపాను వల్ల పడిపోయిన అరటి పంటను పరిశీ లించారు. అరటి పంటకు జరిగిన నష్టంపై రైతులు, ఉద్యాన అధికారులతో చర్చించారు. పంట నష్టం నివేదికలను త్వరిగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 282 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యాన అధికారి బి.రవిచంద్ర బాబు కలెక్టర్‌కు వివరించారు. రాజంపేట పరిధిలో 132 హెకార్లలో అరటి పంట దెబ్బతిన్నట్టు చెప్పారు. ఉద్యాన పంటలకు రూ.5.50 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని తెలిపారు. అరటి సాగు వలన ఉండే కష్టనష్టాల గురించి సాగు చేసే రకాలు, మార్కెటింగ్, డ్రిప్ ద్వారా ఎరువుల వాడకం గురించి కలెక్టర్ రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను వల్ల పంట నష్టం జరిగిన రైతులందరికీ తప్పకుండా నష్టపరిహారం అందజే స్తామన్నారు. జిల్లాలో పంట వేసి నష్టపోయిన రైతులందరికీ ఒక సెంటు కూడా మిస్ కాకుండా పరిహారం ఇస్తామని తెలిపారు. నష్టపరిహారానికి సంబంధించి రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకూడదన్నారు. వ్యవసాయ అధికారులు ప్రతి రైతు దగ్గరికి వెళ్లి పంట నష్ట వివరాలు పారదర్శకంగా సేకరించాలని సూచించారు. ప్రస్తుతం పంట నష్టం వివరాలన్నీ పక్కాగా, పకడ్బందీగా సేకరి స్తామని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా రాజంపేట మండలం, చెర్లోపల్లె పొలం, సర్వే నెంబర్ 290/2లో సంగరాజు రామచంద్రరాజు, సంగరాజు సుభా షిని, సంగరాజు వెంకటరామరాజుకు చెందిన ఆరెకరాల అరటి తోటను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు డ్రిప్పు పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. రైతులందరూ ప్రభుత్వ సబ్సిడీలు సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో నూతన ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టర్ రాజంపేట సమీపంలోని ఎర్రబల్లె సర్వే నెంబర్ 1152లో 4.52 ఎకరాలలో నిర్మించబోయే కేంద్రీయ విద్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, ఎడిఎ రమేష్ బాబు, మండల ఉద్యాన శాఖ అధికారి సురేష్ బాబు, విహెచ్ఎలు రామ్మోహన్ రాజు, శివ ప్రసాద్, విఆర్ఒ మాబుసేన్, గ్రామ సర్పంచ్ మహీంద్రారెడ్డి, ఉపసర్పంచ్ నరసిం హారాజు, రైతులు రామచంద్ర రాజు, శివరామరాజు, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి పాత నేరస్థులను దాదాపు 150 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. 45 ప్రాంతాలను గుర్తించి అక్రమ రవాణా వలన కలిగే నష్టాలు గురించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రవాణా అధికంగా ఉండే ప్రాంతాలలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వాహనాలలో ఇంటి నుంచి వెళ్లినవారు తిరిగి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చేంత వరకు నమ్మకం లేకుండా పోతుందన్నారు. వాహనదారులు రోడ్డు రవాణా నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. ప్రమాదాల నివా రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్య క్రమంలో రాజంపేట డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, సిఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

చెరకు పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి

దెబ్బతిన్న చెరకు పంట పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని రేగళ్ళు గ్రామ పరిసరాల్లో వర్షానికి దెబ్బతిన్న చెరకు పంటను అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. మంగళవారం ఆమె దొడ్డిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో ముఖాముఖి నిర్వహించారు. డ్రిప్స్, మార్కెట్ ధరలు, డ్రౌన్లు, యంత్రసేవ పథకంతో పాటు పలు విషయాలపై వారితో సమీక్షించారు. రేగళ్ళులో వర్షానికి దెబ్బతిన్న చెరకు పొలాలను సందర్శించారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పీరూసాహెబ్ రైతులకు చెరుకు పంట రక్షణకు తీసుకోవలసిన తగిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం చెరకు పూత దశలో ఉండడంతో వీలున్న చోట జడలు కట్టి త్వరగా పంట కోత చేయాలని, లేదంటే చక్కెర నాణ్యతా శాతం తగ్గుతుందని తెలియజేశారు. ఆలస్యంగా నాటిన తోటల్లో ఎకరాకు 50 కిలోల యూరియా, 50 కేజీల పొటాష్ వేయాలని చెప్పారు. 2.5 గ్రాముల యూరియా, 2.5 గ్రాముల మ్యరేట్ ఆఫ్ పొటాష్‌ను లీటరు నీటితో కలిపి పిచకారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీలేరు సహాయ వ్యవసాయ అధికారి వైవి రమణరావు, టెక్నికల్ ఏఓ కరుణాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, ఏఈఓలు నజీర్, అల్తాఫ్, ఆర్‌బికె ఇన్‌చార్జీలు వనజ, కీర్తి, ఆర్‌బికె మిత్ర, మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ వెంకట్రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టండి : ఎఎస్‌పి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని అడిషనల్ ఎస్‌పి వివి.రాజ్‌కమల్ అన్నారు. మంగళవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎఎస్‌పి మాట్లాడుతూ కర్ణాటక మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తున్న వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలన్నారు. మద్యం అమ్మకాలు చేస్తున్న వారు స్వతంత్రంగా నిలిపివేసి, ఇతర పనులు చేసుకొని సుఖవంతమైన జీవితాలను గడపాలని సూచించారు. అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. నాటుసారా తాగడం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యంపై దాడులు విస్తృతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ శివసాగర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పట్టణంలో కర్ణాటక మద్యం, నాటుసారా అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు చోటు చేసుకొంటున్నాయి.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎఎస్‌పి వివి రాజ్‌కమల్

ఉడుంవారిపల్లె కాజ్‌వే ప్రారంభం

నెరవేరిన గ్రామస్తుల చిరకాల కోరిక

ప్రజాశక్తి-రామాపురం

సరస్వతిపల్లి పంచాయతీలోని ఉడుంవారిపల్లె – నారాయనవారిపల్లె వద్ద రూ.2.30 కోట్లతో నిర్మించిన కాజ్‌వేను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ గడికోట మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఉడుంవారిపల్లె ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. అనంతరం రెండు గ్రామాల్లో గడప గడపకు వైసిపి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వారికి ఖాదర్‌వలి, సర్పంచ్ మునీర్ బాషా ఘనంగా బ్యాండు మేళాలతో స్వాగతం పలికారు. రామరాజువంక కాజ్‌వే అధిక వర్షాల వల్ల కొట్టుకుపోవడంతో ఉడుంవారిపల్లె, సరస్వతిపల్లె, నాయునివారిపల్లె, దళితవాడ తదితర పల్లెలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే స్పందించి అనతికాలంలోనే అనతికాలంలోనే రూ.2.30 కోట్ల నిధులును మంజూరు చేయించి నిర్మాణ పనులను త్వరగా ప్రారంభింపచేసి పూర్తిచేయించారు. పనులను త్వరితగతిగా, నాణ్యతగా పనిచేసిన అధికారులును, కాంట్రాక్టర్‌ను శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పనులు పూర్తిచేయించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు జనార్దనరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డి, సూరం వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ మునీర్‌బాష, పిఐయు ఎస్ఇ సురేష్, డిఇ గోపాల్‌రెడ్డి కాంట్రాక్టర్ హరినాథరెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, దామోదర్ నాయుడు, కదిరప్ప నాయుడు, శ్రీధర్ రెడ్డి, సలాం, ఖాదర్ వలీ, హీరాన్ బాష, దర్బార్‌బాష, గౌస్, నాగులయ్య, కేశవులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

తరగతి గది ఆహ్లాదకరంగా ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యా బోధన ఆహ్లాదకర వాతావరణంలో చేయాలని డిఇఒ ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్ష సహకారంతో ఎస్‌సి ఇఆర్‌టి ఆధ్వర్యంలో 'బోధనా సాధనాల ఆధారంగా తరగతి గది పరిశీలన' అనే అంశంపై ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయు లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి బోధనలో నూతనత్వం అవసరమన్నారు. బోధన ఆహ్లాదకరంగా ఉండడానికి ఉపాధ్యా యులు, విద్యార్థుల మధ్య స్నేహపూర్వ సంబంధాలు ఉండాలన్నారు. అందు బాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే ఉపాధ్యాయులు బోధించి నప్పుడు విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయన్నారు. చర్చలు, కృత్యాల ద్వారా బోధన అభ్యసన జరిగినప్పుడు విద్యార్థులలో జ్ఞాన సమపార్జున ఏర్పడుతుందన్నారు. తరగతిగది బోధనాభ్యసనలో పరిశీలన, పర్యవేక్షణ అనేది చాలా కీలకమైన అంశం అన్నారు. కార్యక్రమంలో కోర్సు కో–ఆర్డి నేటర్ నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్స్ మడితాటి నరసింహారెడ్డి, జయచంద్ర, పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘ ఛైర్మన్ కొండూరు శ్రీనివాస్ రాజు, టెక్నికల్ అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

రేగళ్లు పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉష్శశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ సందర్భంగా టీకాలు నిల్వ చేసే రిఫ్రిజరేటర్ (ఐఎల్‌ఆర్), రికార్డులు పరిశీలించి పలు సూచనలు, సలహాలను సిబ్బందికి ఇచ్చారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలకు టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పక్క రాష్ట్రంలో తట్టు కేసులు బయట పడుతున్నాయని, 5 ఏళ్ళ లోపు పిల్లలకు ఎంఆర్ 1, ఎంఆర్ 2 టీకాలను మిస్ కాకుండా వేయాలని, టీకా వేసిన వెంటనే ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ 100 శాతం టాకాలను పూర్తి చేయాలని ఆదేసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ కుమార్, డాక్టర్ సతీష్ కుమార్, సిహెచ్‌ఓలు నారాయణ, జయలక్ష్మి, సూపెర్వైసోర్ విజయలక్ష్మి హెల్త్ ఎడ్యుకేటర్ ఉమ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన జయరామ నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మదనపల్లె టిడిపి నాయకులు శ్రీరామనేని జయరామ నాయుడు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి చర్చించినట్లు జయరామనాయుడు తెలిపారు. పార్టీ పూర్వ వైభవం తీసుకురావాలని లోకేస్ సూచించారన్నారు. తిరిగి టిడిపి కంచుకోటగా మార్చాలని పేర్కొన్నారన్నారు.

లోకేష్‌ను అభినందిస్తున్న జయరామ నాయుడు

బహుదాలో పెరిగిన వరద ఉద్ధృతి

- పలుచోట్ల దెబ్బతిన్న కల్వర్టులు
- గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మాండూస్ తుఫాను ప్రభావంతో విస్తారంగా కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండి మొరవపోతున్నాయి. ముష్టూరు గ్రామంలోని బహుదా నీటి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో నాలుగు రోజులగా ప్రాజెక్టు నుండి ఇరిగేషన్ అధికారులు భారీ స్థాయిలో నీటిని దిగువకు వదిలారు. మంగళవారం కూడా 1600 వందల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదలడంతో బహుదా నదిపై ఉన్న కాజ్‌వేలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. అగ్రహారం వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. వరద ప్రవాహానికి అప్రమత్తమైన తహశీల్దార్ సిఆర్ మంజుల, ఎస్ఐ ఫాతిమ స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు కలిసి రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కాజ్‌వేల వద్ద చెట్టు కొమ్మలతో అడ్డుకట్ట వేసి వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. నిమ్మనపల్లి నుండి బహుదా నదికి ఎడమవైపు ఉన్న ఎర్రగారిపల్లి, గుడ్రెడ్డిరెడ్డిగారిపల్లి, కొండయ్యగారిపల్లి, దేవళం కురవపల్లి, అగ్రహారం, బండమీద మాలపల్లిలతోపాటు వాల్మీకిపురం, చింతపర్తికి పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వరద పెరిగే కొద్ది బహుదా నుంచి అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ఎప్పుడు వరదలు వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంటున్నదని, బహుదా ప్రాజెక్టుకు దిగువన నదిపై ఎత్తయిన వంతెనలను కట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బహుదా ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

నేలకొరిగిన పంటలు... ఆందోళనలో రైతులు

నిమ్మనపల్లి: మాండూస్ తుపాను ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకి మండలంలోని రైతులు సాగు చేసిన పంటలు నేలవాలి నీట మునగడంతో విలవిలలాడుతున్నారు. ప్రభుత్వం పంట నష్టాన్ని గుర్తించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న 150 మంది రైతులకు చెందిన 190 ఎకరాల వరి పంట నీట మునిగి దెబ్బతింది. 65 మంది రైతులకు చెందిన 82 ఎకరాల కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. టమోటా 60 ఎకరాలు, వంగ 3, బెండ 4, దోస 3, బీర 2, బంతిపూలు 3, అరటి 4, బీన్స్ 1, కాలీఫ్లవర్ 2 ఎకరాలు నేలకొరిగాయి. దెబ్బతన్ని పంటలను మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రైతులకు నష్టంవాటిల్లిందన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తి సమాచారాన్ని సేకరించి పంట నష్టాన్ని, రైతులను గుర్తించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.

కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద నీట మునిగిన వరి పంట

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రకాశం

మండలానికి నిధులు కరువు : ఎంపిపి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఎంపిపి ముద్దబాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పుల్లంపేట మండలానికి నిధులు కరువ య్యాయని మండలానికి సంబంధించి నిధులు కేటాయిస్తే మండలం సస్య శ్యామలంగా ఉంటుందని తెలిపారు. ఈ సంవత్సరం నాలుగు లక్షల రూపాయలు పుల్లంపేట పట్టణ మరమ్మత్తుల కోసం, 15 లక్షలు పైపులైన్ల కోసం, 15 లక్షలు మండల కార్యాలయ మరమ్మతుల కోసం ఖర్చు చేశామని తెలిపారు. శాసన సభ్యులు కూడా తన గ్రాంట్ ద్వారా మండలానికి రూపాయి కూడా నిధులు కేటాయించ లేదని అన్నారు. మీ పంచాయతీలలో ఎటువంటి సమస్యలున్నా రోడ్లు, వీధి దీపాలు, ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పై అధికారులకు తెలియజేసి తగిన న్యాయం చేస్తానని తెలిపారు. నిధులు మంజూరైనా కాకపో యినా తన సొంత నిధులతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశం, ఎఒకాన్, జెడ్‌పిటిసి రామనాథం, మండల సచివాలయ సిబ్బంది, ప్రజా పరిషత్ సిబ్బంది, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

అర్బన్ ఎస్ఐగా వెంకటేశ్వర్లు బాధ్యతలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అర్బన్ ఎస్ఐగా పి.వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిఐ నరసింహారావుకు రిపోర్టును అందజేశారు. ఈయన జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై రాజంపేట అర్బన్ ఎస్ఐగా వచ్చారు. గతంలో కడప, అన్నమయ్య జిల్లాల్లో పలు స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు.

ఆచార్లపల్లిలో మురుగునీటి కాలువలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

మండల పరిధిలోని రాచవేటివారిపల్లి పంచాయతీలో సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి గాయత్రి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశు ధ్యం పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షానికి గ్రామ పరిధిలోని గ్రామాల్లో మురుగునీటి కాలువలు పూర్తిగా నిండిపోయి రోడ్లు పై వరద నీరు ప్రవహించిందని అన్నారు. ప్రబలకుండా దిగువమాచిరెడ్డిగారిపల్లి, ఆచార్లపల్లి, డి.మాదిగపల్లితో పాటు గ్రామం వ్యాప్తంగా మురుగునీటి కాలు వలను శుభ్రం చేసి, రోడ్లపై ఉన్న బురదను తొలగించే పనులను చేపట్టామని పేర్కొన్నారు. తాగునీటి ప్రతి ఒక్కరూ కాచి వడపోసుకొని తాగాలని సూచిం చారు. వైద్యసహాయం కావలసినవారు అధికారులకు తెలపాలని చెప్పారు.

కాజ్‌వేకి ఇరువైపులా ముళ్ల కంపలను అడ్డంగా వేసిన సచివాలయం సిబ్బంది

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

బహుదానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీకటిపల్లి విఆర్ఒ నరేష్ ప్రజలకు సూచించారు. తుపాన్ ప్రభావంతో మండలంలో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు బహుదానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పల్లవోలు నుండి చీకటి పల్లికి రాకపోకలు స్తంభించి పోయాయి. కాజ్‌వే పైన నీళ్లు పారు తుండటంతో ఆదారిపై వాహన రాక పోకలను నిలిపివేశారు. బహుదానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచిం చారు. కాజ్‌వే సమీపంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఇరువైపులా ముళ్లకంపలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విఆర్ఒ సుల్తాన్ బాషా, పంచాయతీ సెక్రటరీలు రమేష్‌రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కట్టిన చర్యలు తప్పని ఎస్ఐ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని చౌటపల్లి, వడ్డేపల్లి ఎర్ర చందనం పాత ముద్దా యిలు కౌన్సి లింగ్ ఇచ్చి వారికి హెచ్చరికలు జారీ చేసినట్టు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. సమా జంలో ప్రతి ఒక్కరు ఉన్నత విలువలతో జీవిం చాలని చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు జోలికి పోకుండా ఉండా లని సూచించారు. కార్య క్రమంలో హెడ్ కానిస్టబుల్ రాంప్రసాద్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి
O.S.NO:55/2012.
Between:
అంగడకుర్తి వెంకటరమణ మరియు ఒకరు ...వాదులు
మరియు
అంగడకుర్తి గుంగులప్ప మరియు ఇతరులు ...ప్రతివాదులు
To
D31: బద్దిలి విజయలక్ష్మమ్మ W/o B. వెంకటరమణ
ANR Colony, కొత్త ఇండ్లు, డోర్ నెం:18,
మదనపల్లి, అన్నమయ్య (జిల్లా)
D32: బద్దిలి సునీత D/o B. వెంకటరమణ
ANR Colony, కొత్త ఇండ్లు, డోర్ నెం:18,
మదనపల్లి, అన్నమయ్య (జిల్లా) ...ప్రతివాదులు
D31, D32 ప్రతివాదులకు దావా సమను
పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 2-1-2023 వ తేదికి వాయిదా వేసి యున్నారు. కావున మీ రు 2-1-2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై ఏమైన ఆక్షేపణలు వున్నచో తెలుపుకొన వచ్చును. అట్లు రాని యెడల పై దావాను పై కోర్టువారు మీ పరోక్షమున తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది: 2-1-2023
స్థలం:-కదిరి
ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

కూలడానికి సిద్ధంగా పాఠశాల భవనం

విద్యార్థులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠ శాల దాదాపు 35 సంవత్సరాలు క్రితం నిర్మించిన భవనం నేడో రేపో కూలి పోవడానికి సిద్ధంగా ఉంది. పాఠశాలలో దాదాపు 25మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మాండూస్ తుఫాను ధాటికి పాఠశాల నీటితో నిండి పోయింది. పాఠశాల పైకప్పు కాలం చెల్లిపోవడంతో పెచ్చులు ఊడి గోడలు మొత్తం తడిసి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులు పాఠ శాల సమీపంలోని అంగన్వాడీకేంద్రంలో పిల్లలతో పాటు అన్ని తరగతుల పిల్లలు ఒకే గదిలో చదువులు సాగిస్తున్నారు. అక్కడ పిల్లలకు పాఠాలు చెప్పడానికి బ్లాక్ బోర్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపడానికి ససేమిరా అంటున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో నాడు-నేడుకు ఎంపిక కావడంలేదని తెలిపారు. మూడవ విడతలో మంజూరుకు ప్రయ త్నాలు చేస్తున్నామని అన్నారు. మండల వ్యాప్తంగా ప్రైమరీ 61 ,అప్పం ప్రైమరీ 12 ,హైస్కూల్ , మోడల్, కెజిబివి పాఠశాలలు 7 ఉండగా మొదటి

నాడు-నేడు పనులకు నోచుకోని కమ్మవారిపల్లి ప్రాథమిక పాఠశాల

విడతలో 21 పాఠశాలలు నాడు-నేడు కార్యక్రమంలో సుందరంగా తీర్చిదిద్దారు. రెండవ విడత 23 పాఠశాలలు పనులు జరుగుతున్నాయి. అయితే దాదాపు 35 సంవత్సరాలు క్రింద నిర్మించిన పాఠశాల మాత్రం నాడు-నేడు పనులకు ఎంపిక కాకపోవడం శోచనీయం.

వేలానికి నోచని అద్దె గదులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి

నగర పంచాయతీ అద్దె గదులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని నగర పంచాయతీకి చెందిన అద్దె రూములకు గడువు ముగిసి మూడేళ్లు పూర్తయిన వేలానికి నోచుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని మదనపల్లి రోడ్డు పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న దుకాణ గదులకు గడువు ముగిసి ఐదేళ్లు పూర్తయి నప్పటికీ వేలం నిర్వహించడం పోవడంపై పట్టణ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాగా వ్యాపార జరిగే ఈ ప్రాంతంలో నగర పంచాయతీకి చెందిన గదులను అద్దెకు ఇవ్వకపోవడంపై ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. రెండేళ్ల కాలపరిమితితో హెచ్చు పాటదారులకు గదులు అప్పగించిన విషయం విదితమే. కానీ లాక్‌డౌన్ కారణంగా ఆరునెలలు పెంచాలని నిర్వాహకులు కోరినట్లు, అందుకోసం గడువు పొడిగించినట్లు తెలిపారు. గడువు ముగిసినా కూడా దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఆ అద్దె రూములకు వేలం పాటలు నిర్వహించకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అద్దె రూములకు వేలంపాటలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం

మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్

ప్రజాశక్తి- కలికిరి

ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర ముస్లిం మైనారిటి కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ముస్లిం మైనార్టీల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలికిరి పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో ఈద్గా చేయడానికి గత కొన్ని సంవత్స రాలుగా స్థలం లేకపోవడంతో నమాజ్ చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని దాని కొరకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. జెఎన్‌టియు, సైనిక్ స్కూల్ సమీపంలో రెండు చోట్ల స్థలాలను పరిశీలించి అనువైన స్థలాన్ని ఈద్గాకు కేటాయించాలని తహశీల్దార్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే నన్ను సంప్రదిస్తే పరిష్కారం చూపిస్తామని భరోసా ఇచ్చారు. వైసిపి నాయకులు

ఈద్గా స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ఇక్బాల్ అహ్మద్

అగ మొహిద్దిన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు సాయిదేవరెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమీన్‌పీర్ దర్గా సందర్శన

ప్రజాశక్తి -నందలూరు

కడపపట్టణంలోని అమీన్ పీర్ దర్గాను జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్.ఎ.కరిముల్లా, సయ్యద్‌అమీర్‌లు మంగళవారం దర్శించు కున్నారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ జిల్లాలోని వక్ఫ్ బోర్డ్ ఆస్తులను పరి రక్షిస్తూ, ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తోడ్పడతామని పేర్కొన్నారు. నందలూరులో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు సహక రిస్తామని స్పష్టం చేశారు.

విద్యా రంగంలో మార్పుకు కృషి

ప్రజాశక్తి -కలికిరి

విద్యా రంగంలో సమూల మార్పుల కొరకు టీచ్ ఫుల్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు ఎంఇఒ రంగనాథరెడ్డి తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు 9రోజుల పాటు నిర్వహించే డివిజన్ స్థాయి టీచ్ ఫుల్ శిక్షణ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఎంఇఒ రంగనాథ రెడ్డి , ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద ప్రారంభించారు.ఎంఇఒ రంగనాథ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో టీచింగ్ మెథడ్స్ పైన అవగాహన కలిగించడం, క్లాస్ రూమ్ చేయించే విధానం, ఎక్కడ అవసరమైతే అక్కడ ఉపాధ్యాయులకు ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. శిక్షణకు రిసోర్స్ పర్సన్స్‌గా జి.రామకృష్ణ, అర్జున్‌నాయక్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలస్థాయి, హెచ్‌ఎంలు, సిఆర్‌పి లు, సురేష్, హరి,మురళీధర్ రాజు పాల్గొన్నారు.

ఎఫ్‌సిఒఎల్‌ఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి- తంబళ్లపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎఫ్‌సిఓఎల్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, గ్రామసచివాలయ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు తహశీల్దార్ కళావతి శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో భూముల విస్తీర్ణం పరిశీలించడం, రైతుల అనుభవం దారులు, పట్టాదార పాస్ పుస్తకాలు, రికార్డులు పరిశీలించడం, సమగ్ర సమాచారాన్ని సేకరించే అంశాలపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ఎంపిడిఒ ఆనంద్‌కుమార్,సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి- వీరబల్లి

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలని వైఎస్ఆర్ క్రాంతి పథం సహాయప్రాజెక్ట్‌మేనేజర్ ఖాదర్‌వలి కోరారు.మంగళవారం సంఘం వాండ్లపల్లి రామాలయంఆవరణములో పెద్దివీడు గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల అన్ని రకాల లావాదేవీలు సమావేశాలలో నిర్వహించడం ఉత్తమం అన్నారు. రుణాల ద్వారా ఇష్టమైన జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలని, సక్రమంగా తిరిగి చెల్లిండం వల్ల అధిక మొత్తంలో రుణాలు మంజూరుకు అవకాశముంటుదని తెలిపారు. సమాఖ్యలలో పుస్తక నిర్వహణ సకాలంలో జరగాలన్నారు. కార్యక్రమంలో సిసికృష్ణయ్య, విఒఎలు హేమలత, చామంతి పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన నలుగురు లబ్ధిదారులకు రూ 3.10 లక్షలు విలువ చేసే చెక్కులును మంగళవారం ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. లక్కిరెడ్డిపల్లె మండలం సికె పల్లెకు చెందిన కమ్మెటి సావిత్రమ్మకు రూ 60 వేలు, రాయచోటి మండలం పెమ్మాడపల్లె మొరవవడ్డెపల్లెకు చెందిన కోటకొండ వెంకటేశ్వర్లుకు రూ 20 వేలు, రామాపురం మండలం పొత్తుకూరుపల్లె కొండ్రెడ్డిగారిపల్లెకు చెందిన పూతిరెడ్డి సుబ్బారెడ్డి కి రూ1.20 లక్షలు, మున్సిపాలిటీ లోని రెడ్డివారిపల్లె కు చెందిన దండు శివమ్మకు రూ 1.10 లక్షలు విలువ చేసే చెక్కులును వారికి అందజేశారు. ఈ తమకు ఆరోగ్యాలు బాగలేక, వైద్యానికి అప్పులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అందడం సంతోషంగా ఉందని చెప్పారు. అందుకు సహకరించిన ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, ముఖ్యమంత్రికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, వైసిపి మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, కో-ఆప్షన్ సభ్యులు అయ్యవారురెడ్డి పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

రాయచోటి :లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాలివీడు రోడ్డు మార్గంలో ఇండియన్ పెట్రోల్ బంక్, టోటల్ గ్యాస్ ఏజెన్సీస్, నేషనల్ హై స్కూల్ అధినేత సీనియర్ లయన్ సభ్యులు, మాజీ జోన్ చైర్మన్ లయన్ అశోక్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో పట్టణంలో రోడ్లపై నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భగా లయన్స్ అధ్యక్షులు మహమ్మద్ మాట్లా డుతూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా దుప్పట్లు పంపిణి చేశారని చెప్పారు. ప్రపంచ మంతటా లయన్స్ క్లబ్స్ ద్వారా సేవ చేస్తున్నారంటే అందుకు కారకులు ఆయనే అని తెలిపారు. అలాగే చలి తీవ్రత ఎక్కువగా ఉందని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలతోపాటు గోరువెచ్చటి నీళ్లు ఎక్కువగా తీసు కోవా లని తెలిపారు అనంతరం దాత లయన్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్నే షనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్స్‌ను మెల్విన్ జోన్స్ చేత 1916 లో చికాగో లో స్థాపించారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 200 కంటే ఎక్కువ దేశాలలో ఉన్నాయని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థంగా తన వంతు ప్రజ లకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాయచోటిలో బస్టాండ్, బంగ్లా, రవిహల్, సాయి బాబా గుడి, వీరభద్ర స్వామి గుడి, మార్కెట్ యార్డ్, దర్గాల దగ్గర నిద్రపోతున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర, జోన్ కో-ఆర్డినేటర్ లయన్ షేక్ చాన్ బాషా, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, వెంకట చలపతి, అఖిల్, రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి-రామాపురం

తెలుగు అసోసియేషన్ ఉత్తర అమెరికా తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థికి ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ పురుషోత్తం చౌదరి గుడె ల్యాప్‌టాప్‌ను వితరణ చేశారు. మంగళవారం కల్పనాయునిచెరువు అగ్రహారానికి చెందిన అమృతలక్ష్మికి అందజేశారు. ఆమె కడప అన్నమయ్య ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్‌సి మొదటి సంవత్సరం చదువుతున్నారు. తన చదువుకు ల్యాప్‌టాప్ అందించి సహకరించిన ట్రస్టు వారికి ఈ సందర్భంగా విద్యార్థిని కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రఘు ఎరికిలపాటి తానా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లి హైస్కూల్లో మంగళవారం పాఠశాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కంటి వైద్యులు డాక్టర్ రెడ్డన్న విద్యార్థులకు దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 580 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 27 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి ప్రభుత్వం తరపున త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు కె. సదాశివారెడ్డి, కృష్ణవేణి, ఎఎన్ఎం రెడ్డమ్మ, ఆశా వర్కర్లు కె.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కార్మికులకు బియ్యం అందజేత

పీలేరు : పీలేరు పంచాయితీ కార్మికులకు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత బియ్యం పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యలయం ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఓంశక్తి మాల ధరించిన 21 మంది పంచాయితీ మహిళా కార్మికులకు బియ్యాన్ని అందజేశారు. ఎమ్మెల్యే పంచాయితీ కార్యాలయంలో ప్రజల నుంచి విన తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ప్రతి పాదించారు. కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, జిల్లాపరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎండి షఫి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎస్ఎల్‌వి సంజీవయ్య, మాజీ సర్పంచ్ హుమయూన్, కంభం నరశింహా రెడ్డి, ఉదయ్, ఆనంద పాల్గొన్నారు.

శిశువులకు టీకాలు తప్పనిసరి

పీలేరు : శిశువులకు సోకే అంటువ్యాధులను అంగవైకల్యాలను,మరణాలను నిర్మూలనకు ప్రధాన దోహదకారి వ్యాధినిరోదక టీకాల కార్యక్రమం అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ కొనియాడారు. మంగళవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్స్, రిపోర్ట్స్ టీకాలు నిలువ వుంచే ఫ్రీజ్‌ను అక్కడ ఉండాల్సిన ఉష్ణోగ్రతలు తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తపరిచారు.కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, సిహెచ్‌ఒ నారాయణ,హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, స్టాఫ్ నర్స్, లక్ష్మీ, శిరీష , ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జెసిబితో కాలువ పనులకు మరమ్మతులు చేయిస్తున్న గ్రామప్రజలు

చెరువు కాలువకు మరమ్మతులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని పుల్లంగేరు ప్రవాహం పక్కన ఉన్న రంగంపల్లి చెరువుకు నీరువచ్చేందుకు ఏర్పాటు చేసిన కాలువ మరమ్మతులను జెసిబితో గ్రామ యువత, ప్రజలు, రైతులు తమ సొంత వ్యయంతో చేయించుకున్నారు. చుట్టుపక్క గ్రామ ప్రజల అభివృద్ధి కోసం చెరువు కాలువకు మరమ్మతులు చేయించినట్లు యువకులు పేర్కొన్నారు. భారీ వర్షాలకు అన్ని చెరువులు కళకళ లాడుతున్నాయని రంగంపల్లె చెరువు మాత్రం వెలవెలబోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువుకు నీరు వచ్చే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

నిరాశ్రయులకు సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్, పాతబస్టాండ్ కూడలి వద్ద నిరాశ్రయులైన పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షులు పి.వెంకట రమణ మాట్లాడుతూ ప్రస్తుతం శీతాకాలమే కాకుండా మాండుస్ తుఫాను కార ణంగా రాష్ట్రంలో చలి ప్రభావం ఎక్కువగా ఉన్నందున నిరాశ్రయులు చలి నుంచి తట్టుకునేందుకు తమవంతు సహాయం అందజేశామని తెలిపారు. కార్య క్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.అబ్దుల్లా, మణిఆచారి, ఆనంద్ ఆచారి, విశ్వ నాథ్, హరికృష్ణ రాజు, శరత్ బాబు, సుబ్బారావు, అశోక్, రవి, కిషోర్ పాల్గొన్నారు.

ప్రముఖ గైనకాలజిస్ట్ సౌజన్య మృతి

రైల్వేకోడూరు :విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకటసుబ్బయ్య సతీమణి గైనకాలజిస్ట్ డాక్టర్ సౌజన్య మంగళవారం హైదరాబాదులోని బసవతారకం ఆసుపత్రిలో మృతి చెందారు. కోడూరు పట్టణంలో ప్రైవేటు నర్సింగ్ హోమ్ ఏర్పాటు చేసి ఎంతో మందికి సౌజన్య వైద్య సేవలు అందించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్రైవేట్ అంబులెన్సులు నడపాలని రెండో పట్టణ సిఐ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ అంబులెన్స్‌లకు ఎంవిఐ త్వరలో రేట్లు నిర్ధారిస్తారని చెప్పారు. నిర్దేశిత ధరల ప్రకారమే రోగులను ఇతర ప్రాంతాలకు అంబులెన్స్ తరలించాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జెడి గుణశేఖర్

పశు వైద్యశాలలో జెడి తనిఖీ

తంబళ్లపల్లి : మండలంలో పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం అభివృద్ధికి పశు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ సూచించారు. మంగళవారం పశువైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డు పరిశీ లించారు. ఉద్యోగుల పనితీరుపై ఎడి సుమిత్రను అడిగి తెలుసుకున్నారు. మూగ జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందించడం దేవుడు ఇచ్చిన వరంగా భావించాలని తెలిపారు. గ్రామాలలో పాడి జీవాల యజమానులకు పలు సూచనలు ఇచ్చి అభివృద్ధి చెందే విధంగా చూడాలని అన్నారు. అనంతరం 14 మంది పాడి రైతులకు సబ్సిడీ గడ్డి కటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. ఒక్కో యంత్రం ధర 33,970 రూపాయలు కాగా, రైతు వాటా 20,382 రూపాయలు చెల్లించి రైతులకు 13,588 రూపాయలకు ప్రభుత్వం సబ్సిడీతో యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తునికి రక్తదానం

బి.కొత్తకోట : ఒంగోలులో చికిత్స పొందు తున్న కార్తీక్ వ్యాధిగ్రస్తునికి ఓ గ్రూప్ రక్తం అవసరమైన విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా యంగ్‌ఇండియా సేవాసంస్థ అధ్యక్షులు తగాది రాజశేఖర్ తెలుసుకున్నారు. సంస్థ సభ్యుడు హరి ఒంగోలుకు వెళ్లి బాధితుడికి రక్తాన్ని ఇచ్చారు. రాజశేఖర్ మాట్లా డుతూ యంగ్ ఇండియా సేవా సమితి సంస్థ ద్వారా అన్నిరకాల సేవా కార్య క్రమా లకు శ్రీకారం చుట్టామని తెలి పారు.బెంగుళూరుకు సేవను విస్తరిస్తామన్నారు.

నేడు గంగమ్మ జాతర వేలం పాట

లక్కిరెడ్డిపల్లి : 2022వ సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే తేదీల్లో గంగమ్మ జాతర కార్యక్రమంలో టెంకాయలు, పూలు, టోల్గేట్ అంగళ్లు, టోల్గేట్ తలనీలాలు సేకరించుటకు 14వ తేది బుధవారం గంగమ్మ దేవస్థానంలో వేలంపాట నిర్వహి స్తున్నట్లు ఆలయ చైర్మన్ సామల నరసింహారెడ్డి , కార్య నిర్వహణ అధికారి రవీంద్రరాజు తెలిపారు.

తేక్వాండోలో స్వర్ణ పతకం

బద్వేల్ : వైవీయూలో నిర్వహించిన ఇంటర్ కళాశాలల తైక్వాండోపోటీల్లో బద్వేల్ శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ కళాశాల డిగ్రీ ప్రథమ సంవత్సరం జర్నలిజం విద్యార్థిని కరిడి కీర్తి గోల్డ్ మెడల్ సాధించిందని కళాశాల పరిపా లనాధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ తెలియజేశారు. మంగళవారం విద్యార్థి నిని మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచపూడి వెంకటసాయికృష్ణ, ప్రిన్సిపల్ సత్య నారా యణ, సిబ్బంది అభినందించారు.

క్రైం కార్నర్

కుంటలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

చేపల కోసం చెరువుకు వెళ్ళి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కుమ్మరవీధిలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు కుమ్మరవీధికి చెందిన మైలారీ కృష్ణప్ప (45) అనే వ్యక్తి సమీపంలోని చెరువులో చేపల వేట కోసం వెళ్లి చెరువులో చెట్ల మధ్యలో ఇరుక్కొని మృతి చెందాడు. అతనితో వెళ్లిన వెంకటేష్ అనే వ్యక్తి ఎంత అరచినా స్పందించక పోవడంతో స్థానికులతో కలసి మృతదేహాన్ని వెలికి తీశారు.